క్లుప్తంగా

అందుబాటులో హోమియో వైద్యం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలోని హోమియోపతి హాస్పిటల్‌ను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ కోరారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రభుత్వ హోమియోపతి హాస్పిటల్ అభివృద్ధి సమావేశంలో ఆయన మాట్లాడారు. హోమియోపతి ఆస్పత్రిలో వైద్యసేవలు, అందుబాటులో మందులు ఉన్నాయన్నారు. రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ కె.కె.సత్యనారాయణ ఆస్పత్రికి 5 కుర్చీలను వితరణ చేశారు. ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఒ.వెంకటరావు, ఇ.వెంకటరావు, ఎ.రామారావు, ఇ.సురేష్, తాడిశెట్టి ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు అమృతరావు జయంతి

ఉక్కునగరం: ఉక్కు ఉద్యమ నేత తమనంపల్లి అమృతరావు జయంతి వేడుకలను స్టీల్ వైస్సార్ టీయూసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ఉక్కు హిల్‌టాప్ కొవ్వొత్తుల జంక్షన్ వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి యూనియన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప కోరారు.

వైభవంగా సత్యసాయి అవతార ప్రకటన ర్యాలీ




ఉక్కునగరంలో సత్యసాయి ర్యాలీలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: సత్యసాయి అవతార ప్రకటన ర్యాలీ శుక్రవారం వైభవంగా జరిగింది. సెక్టార్–11 నుంచి ప్రత్యేక రథంతో ప్రారంభమైన ర్యాలీని వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్ ప్రారంభించారు. ర్యాలీ పలు సెక్టార్ల మీదుగా సత్యసాయి మందిరం చేరుకుంది. సత్యసాయి కన్వీనర్ జి.రామకృష్ణ, మాజీ ఉన్నతాధికారులు ఎస్.ఎస్.రావు, ఆర్.వి.రావు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ

కూర్మన్నపాలెం: కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకపు ప్రతిపాదనను వెనక్కి తీసుకోక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 981వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు.

పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న పోరాట కమిటీ చైర్మన్ నర్సింగరావు

ఉక్కునగరం: పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షలు వెయ్యి రోజులకు చేరుకుంటున్న సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కార్మికులను చైతన్య పరిచేందుకు విభాగాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం టౌన్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పోరాటంలో పాల్గోవడం వల్ల మాత్రమే ప్రభుత్వం వెనక్కు వెళుతుందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వై.మస్తానప్ప, మసేనురావు, బిషాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌వీ నగర్‌లో సరస్వతీదేవిగా కనకదుర్గ



కణితి గవర వీధిలో సరస్వతీ దేవిగా దుర్గాదేవి



వాగేశ్వరిగా శ్రీ మహాసరస్వతి



మహాలక్ష్మీదేవి అవతారంలో శ్రీ మహాదుర్గ



సరస్వతీ దేవి అలంకరణలో దుర్గాలమ్మ

వీణాపాణి.. విద్యాప్రదాయిని

- సరస్వతీదేవిగా అమ్మవారి దర్శనం
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

వీణాపాణి.. విద్యాప్రదాయిని సరస్వతీ మాత. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు, శుక్రవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారిని చదువులతల్లిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. వేద వినుత.. విద్యాప్రదాత అయిన అమ్మవారిని నియోజకవర్గ వాసులు భక్తిశ్రద్ధలతో పూజించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు.



కన్యకా పరమేశ్వరి ఆలయంలో సరస్వతీ పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



కణితి దుర్గాదేవి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు



గంగవరంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు

పెదగంట్యాడ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలోని కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో, కోరాడలోని దుర్గాదేవి ఆలయంలో, బర్మా కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో, 64వ వార్డు పరిధిలోని గంగవరంలో అంజనీపుత్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండపం వద్ద దుర్గాదేవి సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

ఎల్‌వీ నగర్ కనకదుర్గ ఆలయంలో..

గాజువాక : 70వ వార్డు ఎల్‌వీ నగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు సామూహిక పూజలు చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ

కూర్మన్నపాలెం: 87వ వార్డు కణితి గవరవీధిలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని శుక్రవారం సరస్వతీ దేవిగా అలంకరించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు చిన్నారులకు పలకలు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కోమటి రమాదేవి, అతికంశెట్టి రవి, సిరపనశెట్టి నరసింగరావు, కాండ్రేగుల అప్పలనాయుడు, సిరపనశెట్టి సీతాలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భవానీ భక్తులు పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయంలో సహస్ర కలువ పుష్పార్చన

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి ఆలయంలో శ్రీ మహాదుర్గ అమ్మవారికి శుక్రవారం సహస్ర కలువ పుష్పార్చన నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మహాదుర్గ అమ్మవారు బంగారు వర్ణం చీరలో మహాలక్ష్మీదేవిగా, శ్రీ మహాలక్ష్మి అమ్మవారు గులాబీ వర్ణం చీరలో ధనలక్ష్మిగా, శ్రీ మహాసరస్వతి అమ్మవారు పసుపు వర్ణం చీరలో వాగేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో మహిళలు మణిద్వీప వర్ణార్చన (కలశ పూజ) నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ ఆలయ ఆవరణలో సరస్వతీ పూజ నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం సత్య సాయిబాబా అవతార దినోత్సవం సందర్భంగా బాబా చిత్రపటానికి పూలమాల వేసి హారతి ఇచ్చారు. తరువాత బాల వికాస్ గురువులు సరస్వతి విందుల, వి.రమ, పద్మలత బాలలకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. తల్లిదండ్రులు, గురువులు దైవంతో సమానమని తెలియజేస్తూ.. మానవతా విలువల గురించి వివరించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి అధ్యక్షుడు విందుల పైడినాయుడు, సత్యసాయి సేవాదళ్ ఎల్.వి.రమణ, జాజుల మోహనరావు, గంగాధర్, రాజేశ్వరి, కళావతి, ఉమా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీ పూజలో పాల్గొన్న బాలలు, భజన మండలి ప్రతినిధులు

సరస్వతీ దేవిగా దుర్గాలమ్మ

అగనంపూడి: అగనంపూడిలోని దుర్గాలమ్మ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. సామూహిక అక్షరాభ్యాసాలు, విశేష అన్న సమారాధన చేపట్టారు. నిర్వాసిత కాలనీల నుంచి వేలమంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. బొర్రమాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాట్లు చేసింది.



స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో మణిద్వీప వర్ణనార్చనలో పాల్గొన్న భక్తులు

69వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: హరిజన జగ్గయ్యపాలెంలోని శ్రీ కోదండ రామాలయంలో కొలువైయున్న సరస్వతీ దేవి ఆలయంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. గ్రామ పెద్ద పెట్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వందడుగుల రోడ్‌లో పెట్రోల్ బంక్

- జీవీఎంసీ కమిషనర్ స్థల పరిశీలన

గాజువాక : చినగంట్యాడ వందడుగుల రోడ్‌లో జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన ఆ స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఎంత స్థలం అవసరం, ఏ విధంగా ఏర్పాటు చేయాలి, ఎలాంటి జాగ్రత్తలను తీసుకోవాల్సి ఉంటుందన్న అంశాలపై చర్చించారు. ఈ బంక్ జీవీఎంసీ వాహనాల కోసం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనను సమర్పించాల్సిందిగా జోనల్ కమిషనర్ పి.సింహాచలంను, చీఫ్ సిటీ ప్లానర్ సునీతను ఆదేశించారు. పరిశీలనలో ఎస్ఈ గోవిందరావు, ఈఈ మత్స్యరాజు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీలక్ష్మి తదితరులున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో జాగ్రత్తలపై అవగాహన

అగనంపూడి: సంప్రదాయ పెట్టుబడి మార్గాలకు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులకు వ్యత్యాసాలను గుర్తించి ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయాలని సెబీ ఏజీఎం సుస్మిత సేథి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంట్రడక్షన్ టూ సెక్యూరిటీస్ మార్కెట్ అనే అంశంపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. కొద్దిపాటి ప్రమాదంతో అధిక లాభాలు ఆర్జించే పద్ధతులను ఆమె వివరించారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ బొడే ప్రసాద్, హెచ్‌వోడీ బి.చంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

'భవానీ మాలధారణ విశిష్టం'



భవానీ మాతను దర్శించుకుంటున్న సుమన్

గాజువాక : ప్రజల్లో రోజురోజుకు భక్తిభావం పెరుగుతోందని సినీ నటుడు సుమన్ తల్వార్ అన్నారు. స్థానిక కుంచుమాంబ కాలనీలో భవానీ భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మను శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భవానీమాల ధరించిన భక్తులతో కొద్దిసేపు మాట్లాడారు. భవానీ మాలధారణ ఎంతో విశిష్టమైందని పేర్కొన్నారు. అమ్మదయ ఉంటే అన్నీ ఉన్నట్టేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, స్థానిక పెద్దలు సతీష్ కుమార్, రాము, బ్రహ్మాజీ, తిరుమలరావు, శ్రీను, సతీష్, వాసు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ డ్రై డే పాటించాలి

పెదగంట్యాడ: ప్రతి ఒక్కరూ శుక్రవారం డ్రై డే పాటించాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లో శుక్రవారం ఆయన జీవీఎంసీ అధికారులతో కలసి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై ఎవరూ చెత్త వేయరాదని, ఇళ్లలోనే తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి, జీవీఎంసీ సిబ్బంది

జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు

పెదగంట్యాడ: తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన 34వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పెదగంట్యాడ సంజీవ కాలనీకి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఎస్పీ చాంపియన్స్ అకాడమీకి చెందిన ప్రవల్లికా రెడ్డి (13) 600 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, బండారు హాసిత (16) జావెలిన్ త్రోలో వెండి పతకం సాధించారు. కె.నందిని (14) జావెలిన్ త్రోలో 6వ స్థానంలో నిలిచింది.

మూడు వారాల్లో రహదారుల విస్తరణ

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం

గాజువాక : గాజువాక జోన్‌లో చేపట్టిన రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులను మూడు వారాల్లో పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటిల్లు జంక్షన్ నుంచి బీసీ రోడ్ మార్కెట్ వరకు చేపట్టిన కణితి రోడ్ విస్తరణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. మూడు వారాల్లో రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని, రోడ్డుకు సంబంధించిన అడ్డంకులను వారం రోజుల్లో సరి చేసి ఆటంకంగా ఉన్న నీటి పైపులను మార్చాలని ఆదేశించారు. దువ్వాడ స్టేషన్ రోడ్‌లో కూర్మన్నపాలెం జాతీయ రహదారి నుంచి దువ్వాడ ఫ్లైఓవర్ వద్ద పెట్రోల్ బంక్ వరకు చేపట్టిన విస్తరణ పనులతో పాటు కాలువలు, డివైడర్లు, ఫుట్‌పాత్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రోడ్‌ను అందంగా తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా సంరక్షించాలని చీఫ్ సిటీ ప్లానర్ సునీతను, ఎస్టేట్ అధికారి ఆనంద్‌ను ఆదేశించారు. పరిశీలనలో 66వ వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్, జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఎస్ఈ గోవిందరావు, ఈఈ మత్స్యరాజు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీలక్ష్మి తదితరులున్నారు.



కణితి రోడ్ విస్తరణను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

పేదల ఆరోగ్యానికి 'సురక్ష'

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన



నెల్లిముక్కులో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి రక్ష అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయన్నారు. జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు సచివాలయ పరిధి పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారన్నారు. ప్రజలకు చేరువలో కార్పొరేట్ స్థాయిలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, అత్యాధునిక పరికరాలతో స్పెషలిస్టు వైద్యులను సైతం ఇళ్ల వద్దకే తీసుకొచ్చి పరీక్షలు చేయిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

259మందికి సేవలు

వైద్య శిబిరంలో 259 మందికి ఏడుగురు వైద్యులు సేవలు అందించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రమేష్‌బాబు, హేమలత, డాక్టర్ మహ్మద్ సుహాస్, డాక్టర్ సాయి ప్రణీత్, డాక్టర్ పావని, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ జైనబ్ రోగులను పరీక్షించి, మందులు అందించారు. శిబిరంలో బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన పరీక్షలతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జోన్–6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, క్లస్టర్ మండల అధ్యక్షుడు రాజాన వెంకటరావు, వార్డు ఇన్‌చార్జి గొందేశి శ్రీనివాసరెడ్డి, తనకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్‌లో 125 మందికి..

కూర్మన్నపాలెం: పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. జీవీఎంసీ 86వ వార్డు భరత్‌నగర్–2 దువ్వాడ యూపీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి పరిశీలించారు. వైద్య శిబిరంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నళినీ పుష్పలత, డాక్టర్ భానుజతో కలిసి మొత్తం ఏడుగురు వైద్యులు సేవలు అందించారు. శిబిరంలో సాధారణ వైద్యులతో పాటు ఈఎన్‌టీ , డెర్మిటాలజిస్ట్, ఆర్థోపెడీషియన్, డెంటిస్ట్ రోగులను పరీక్షించి, మందులు అందించారు. యూపీహెచ్‌సీ పరిధిలో 125 మంది వైద్య శిబిరానికి హాజరై, వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, మెడికల్ బాబు, వాడపల్లి రామచంద్రరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కణితి పీహెచ్‌సీ పరిధిలోని వైద్య శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కణితి పీహెచ్‌సీలో 250 మందికి..

జీవీఎంసీ 87వ వార్డు కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వడ్లపూడి సచివాలయం–02 ప్రజల సౌకర్యార్థం నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మంది వైద్య సేవలను పొందినట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి శిబిరాన్ని పరిశీలించారు. ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు



రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నవంబర్ 8న నిరసన విజయవంతం చేయాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భాగంగా నవంబర్ 8న నిర్వహించనునన భారీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ప్రైవేటీకరణ వ్యతిరేక నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న దీక్షలు నవంబర్ 8వ తేదీకి వెయ్యి రోజులకు చేరుతుందన్నారు. ఆ రోజు జరగనున్న కార్యక్రమంలో ఉక్కు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పాటు పాల్గోవాలని కోరారు. కార్యక్రమంలో కారు రమణ, ఆకుల నూకరాజు, బీఎంకె నాయక్, నర్సింగరావు, ఆర్.కోటేశ్వరరావు, డి.మోహన్ పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఇంటక్ నాయకులు

భారీ వాహనాల రాకపోకల నిషేధానికి వినతి

గాజువాక : స్వతంత్రనగర్ వై జంక్షన్ నుంచి జగ్గు జంక్షన్, వందడుగుల రోడ్ మీదుగా జాతీయ రహదారి పైకి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలను దారి మళ్లించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు నివాస్, వార్వా, వాయిస్ ఆఫ్ గాజువాక, జన విజ్ఞాన వేదిక నాయకులు తిప్పల వంశీరెడ్డి, రాజాన రామారావు, ఎ.జె.స్టాలిన్, పులి లక్ష్మీబాయి, గంధం శ్రీనివాసరావు, ఉరుకూటి చందు, బి.గంగారావు, దల్లి గోవిందరెడ్డి, పల్లా శ్రీనివాసరావు తదితర కార్పొరేటర్లకు శుక్రవారం వినతి పత్రాలు సమర్పించారు. గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్‌లకు చెందిన భారీ వాహనాలు బొగ్గుతో పాటు ఇతర రసాయనిక పదార్థాలను రోడ్ పై వెదజల్లుతూ ప్రయాణిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ దారిలో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలను దారి మళ్లించి న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రాలను సమర్పించిన వారిలో వివిధ సంఘాల నాయకులు గురప్ప, కె.కిరీటం, త్రినాథస్వామి, విశ్వనాథం, డి.అప్పారావు, వెంకట రమణ పరశురామ్ ఉన్నారు.

బీసీ రోడ్‌లో అన్న సమారాధన



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గాజువాక/పెదగంట్యాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాక్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. బీసీ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని 65వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దాల అప్పారావు ప్రారంభించారు. మూడు వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, యూత్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మిజోరం గవర్నర్ పర్యటన

మహారాణిపేట: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన శనివారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంటారు. 23వ తేదీ వరకు స్థానికంగా జరిగే పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 24న హైదరాబాద్ వెళ్లి అక్కడ కార్యక్రమాల అనంతరం 26న తిరిగి విశాఖపట్నం వస్తారు. 30న ఉదయం విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ నుంచి కోల్‌కతా మీదుగా ఐజ్వాల్ వెళ్లనున్నారు.